ఇంట్లోకి వెళ్ళకుండా బయట గోడ వెనక దాక్కొని ఇదంతా గమనించసాగింది ఆ అమ్మాయి. తన తల్లిదండ్రుల ముందుకు వెళ్ళడానికి ఇష్టపడలేదు ఆమె.
అజ్ఞాతంలో నుండి బయటపడకూడదని అనుకుంది. సురేష్ ని అంతమొందించే దాకా తను చీకట్లోనే ఉండాలని నిర్ణయించుకుంది. అందుకే అలా రహస్యంగా తల్లిదండ్రుల సంభాషణ వింటోంది.
ముసలాయన నెమ్మదిగా లేచి లోనికి వెళ్ళాడు. కాసేపటి తర్వాత ఒక ఫోటో ఆల్బం తో బయటకు వచ్చాడు. ముసలామె పక్కన కూర్చుని దాన్ని తెరిచి ఆమెకు చూపించసాగాడు. కన్నీళ్ళ పర్యంతం అయిందామె.
" ఎంత బాగా పెంచామండీ అమ్మాయిని..ఈనాడు మనకు కనబడకుండా పోయింది " అని బాధపడసాగింది .
" ఎక్కడికీ పోలేదు..తప్పకుండా తిరిగి వస్తుంది..బాధపడకు " అంటూ ఓదార్చాడు
" అయినా భగవంతుడు నిర్దయుడు అండీ.. అమ్మాయిని ఇచ్చినట్టే ఇచ్చి ఇంతకాలం తర్వాత తీసుకుపోయాడు " అంది
" అవన్నీ ఇప్పుడు ఎందుకు..మనకు పుట్టకపోయినా సొంత కూతురి కంటే ఎక్కువగానే పెంచి పెద్ద చేసాము కదా.." అన్నాడాయన

ఇదంతా వింటున్న ఆ అమ్మాయి ఖ్రాంపడిపోయింది. భూమి బ్రద్దలవుతున్నట్టు , సముద్రాలు పొంగుతున్నట్టు ..ఆమె చెవుల్లో హోరు.
" ఏమిటి వీళ్ళు అంటున్నది..తను వీళ్ళ సొంత కూతురు కాదా " అని దిగ్భ్రమ కు లోనయింది

తను వింటున్నది కలో నిజమో ఆమెకు అర్థం కాలేదు. మైండ్‌బ్లాంక్అయింది. వీళ్ళు తన సొంత పేరెంట్స్‌కాకపోతే అసలు వాళ్ళు ఎవరు ? ఎక్కడ ఉన్నారు ? వాళ్ళని ఎలా కలవాలి ? ఈ ప్రశ్నలన్నిటితో బుర్ర తిరుగుతున్నట్టుగా అనిపించింది. ఇక అక్కడ నిలవలేక నిశ్శబ్దంగా శరత్‌ఇంటికి వచ్చేసింది.

* * *

శరత్‌తన రూములో కూర్చుని ఫ్రెండ్‌రిత్విక్‌తో ఫోన్‌లో మాట్లాడుతున్నడు.
అటునుండి రిత్విక్ " ఏమంటుందిరా నీ రూమ్మేట్" అన్నాడు
" ఎంతకీ రెస్పాండ్ అవడం లేదురా..అప్పటికీ అడిగాను.. ఇలా నువ్వు నా రూం లో ఉంటే నాకు ప్రమాదం కదా అని..తను అలాంటి దాన్ని కాదని...తన వల్ల ఏ ప్రమాదమూ రాదని అంటోంది.. ఆమె శరీరాన్ని టచ్ చెయ్యాలని చూస్తే సీరియస్ అయింది " అన్నాడు శరత్
" అవునా.. అయితే కొంచెం స్లో గా డీల్‌చెయ్యాలి.. జాగ్రత్త.." అని పెట్టేసాడు రిత్విక్.
ఇంతలో రాజమార్గం గుండా రూము లోకి వచ్చింది ఆ అమ్మాయి.
శరత్‌ని చూస్తూ " ఇంకా నిద్రపోలేదా.." అంది
" నీ కోసమే ఆలోచిస్తూ ఉన్నాను..నిద్ర ఎలా పడుతుంది " అన్నాడు శరత్
" అబ్బో.. చాలా మాటలు నేర్చావు .."
" నీ అందం చూస్తే మాటలేంటి ...కవిత్వమే వస్తుంది.." అన్నాడు
పక పకా నవ్వేసింది ఆ అమ్మాయి. ఇంతలో కింది నుండి తల్లి అరుణ " శరత్..కొంచెం అన్నం తినరా.." అని గట్టిగా పిలిచి చెప్పింది.

" ఆ ..తింటానమ్మా.." అని చెప్పి రూములో నుండి బయటకు వెళ్ళాడు. కింద కిచెన్‌లోకి వెళ్ళి ఒక ప్లేట్‌లో ఫుడ్ అయిటెంస్ పెట్టుకుని మెట్లెక్కుతుండగా , తల్లి అరుణ " వేళకి తిను శరత్..లేకపోతే ఆరోగ్యం పాడవుతుంది " అని హెచ్చరించింది

" అబ్బా.. అలాగే అమ్మా " అంటూ తన రూములోకి వచ్చి తలుపేసేసాడు.

ఆ అన్నం ప్లేట్‌ని ఆ అమ్మాయి ముందుంచి " తిను.." అని ప్రేమగా అన్నాడు

" ఓ..థేంక్స్..." అంటూ ప్లేట్ తీసుకుని తినసాగింది. ఆమెని అపురూపంగా చూస్తూ ఉన్నాడు శరత్.

" ఏంటి అలా చూస్తున్నావు.." అడిగింది ఆ అమ్మాయి

" నువ్వెవరో..నేనెవరో..ఇలా కలిసాం.. అంతా ఫేట్ కదా.." అన్నాడు శరత్

" అవును..నిజంగానే ఫేట్.. " అంది

" ఇప్పుడైనా చెప్పొచ్చు కదా..నువ్వెవరో ...ఎందుకు ఇలా నా రూములోకి వచ్చావో.." అని అడిగాడు

నెమ్మదిగా నిశ్వసించి ఆమె చెప్పింది." నేను ఒక దురదృష్టవంతురాలిని.. కన్న తల్లిదండ్రులకు దూరమై..పెంచిన తల్లిదండ్రులను చేరుకోలేక..ఇలా అజ్ఞాతం లో గడుపుతున్నాను. నా బ్రతుకు ని నాశనం చేసిన ఒక వెధవని పట్టుకోవడానికి ప్రయత్నిస్తున్నాను. ఆ పని పూర్తవ్వగానే ఇక్కడి నుండి వెళ్ళిపోతాను. ఇంతకంటే ఎక్కువ చెప్పలేను " అంది.

" అమ్మో..నీ వెనక ఇంత స్టోరీ ఉందా..చాలా తప్పుగా అర్థం చేసుకున్నాను.. "

అన్నాడు శరత్. అన్నం తినడం పూర్తి చేసిందామె.   " ఇక నేను నిద్రపోతా " అంది. శరత్ లేప్‌టాప్ ఓపెన్ చేసి ఏదో వర్క్ చేసుకోవడానికి కూర్చున్నాడు. ఆమె నవ్వుకుంటూ బెడ్‌మీద వాలిపోయింది.

* * *

పరిమళ ఇంటి దగ్గర కానిస్టేబుల్‌కాపు కాయడం మొదలు పెట్టాడు. ఎస్సై ఇచ్చిన ఆర్డర్‌ప్రకారం సురేష్ ని అబ్జర్వ్ చేసి రిపోర్ట్ ఇవ్వాలి. పొద్దున్నే భార్య ఆఫీసుకి వెళ్ళగానే నింపాదిగా  లేచి , తీరిగ్గా కాలకృత్యాలు తీర్చుకుని బ్రేక్‌ఫాస్ట్ చెయ్యడం, తర్వాత టీవీ చూడటం , మళ్ళీ లంచ్ చెయ్యడం , మళ్ళీ నిద్రపోవడం.
మధ్య మధ్యలో ఫోన్‌కాల్స్ చెయ్యడం తప్ప ఇంకేమీ అసాధారణ పనులు సురేష్ డైలీ లైఫ్‌లో కనిపించలేదు కానిస్టేబుల్‌కి.
అందుకే సురేష్ ని తేలిగ్గా తీసుకుని అక్కడి నుండి వెళ్ళిపోయాడు. అదే విషయాన్ని ఎస్సైకి చెప్పాడు " సార్..అతనో సోంబేరి సార్.. పెళ్ళాం మీద ఆధారపడ్డ ఒక పేరసైట్..అంతకు మించి అతన్ని అనుమానించాల్సిన పని లేదు సార్" అని.
" అలాగా ..సరేలే ..." అని లైట్‌గా తీసుకున్నాడు ఎస్సై.
అదే రోజు ...సురేష్ కి కాల్‌చేసాడు పరిమళ బాస్ సురేంద్ర.
" ఎంతవరకు వచ్చింది పని..ఎవరో మంచి ఫిగర్‌దొరికింది అన్నావ్.. కానీ మళ్ళీ తప్పించుకుపోయింది అని చెప్పావ్. ఏంటి నాటకాలు ఆడుతున్నావా..నేను అడిగింది  తప్ప నీ అన్ని ఎంజాయ్‌మెంట్‌లు బాగానే చూసుకుంటున్నావు.. జాగ్రత్త.." అని చెప్పి ఫోన్ పెట్టేసాడు.

ఫోన్‌ని బద్దలుగొట్టేద్దాం అన్నంత కోపం వచ్చింది సురేష్ కి. ఎఫ్ అనే అక్షరంతో వచ్చే పదం తో తనను తానే కసిగా తిట్టుకున్నాడు.
సురేంద్ర అప్పగించిన పని అంత చిన్నదేమీ కాదు. తానేమో ఈ పరిమళ ఇంట్లో చిక్కుకున్నాడు. బయటకు వెళితే తప్ప అవదు. వీలు చూసుకుని ఆ పనులు పూర్తి చెయ్యాలి. పరిమళ సంగతి తర్వాత చూడొచ్చు అని నిర్ణయించుకున్నాడు. అలా బయటికి వెళ్ళడం అతని ప్రాణానికే ప్రమాదం అని ఆ క్షణంలో తెలీదు అతనికి.

* * *

శరత్ రూములో ఉన్న అమ్మాయి ...అక్షర. పెంచిన తల్లిదండ్రులు పెట్టిన పేరు అది.
ఇప్పుడు దీర్ఘంగా ఆలోచించసాగింది. తన అసలు తల్లిదండ్రులు ఎవరు ? తను ఎక్కడ పుట్టింది ?పుడితే వీళ్ళ చేతుల్లోకి ఎలా వచ్చింది ? ఈ ప్రశ్నలన్నిటికీ సమాధానాలు కావాలి. పెంచిన తల్లిదండ్రులు ఎప్పుడూ ఈ వివరాలు చెప్పలేదు. మరి కనుక్కోవడం ఎలా ? తన బర్త్ సర్టిఫికేట్ చూస్తే తెలుస్తుందేమో అనుకుంది. అప్పట్లో ఒక సారి చూసింది కానీ పెద్దగా పట్టించుకోలేదు. అయితే బర్త్ సర్టిఫికెట్ ఇంట్లో ఉంది. తెచ్చుకోవడం ఎలా అని ఆలోచించింది. ఈ విషయంలో శరత్ హెల్ప్ తీసుకోవాలనుకుంది.
అతన్ని కదిపి చూసింది. " శరత్..నాకో హెల్ప్ చెయ్యాలి.. " అని అడిగింది
" చెప్పు ..ఏం చెయ్యాలి " అన్నాడు శరత్

ఏం చెయ్యాలో చెప్పింది అక్షర. " సరే .." అని కార్యాచరణ లో దిగాడు శరత్.

తర్వాతి రోజు.. అక్షర వాళ్ళ ఇంటికి  వెళ్ళాడు. " ఎవరండీ ..లోపల " అని పిలిచాడు. ముసలాయన బయటకు వచ్చి " ఎవరు బాబూ నువ్వు...ఏం కావాలి " అని అడిగాడు

" మేము మెడికల్ డిపార్ట్‌మెంట్ నుండి వచ్చామండీ ..వివరాలు సేకరిస్తున్నాము.. త్వరలో అందరికీ కరోనా వేక్సిన్ మూడో డోస్‌వెయ్యాలి. మీ ఇంట్లో పద్దెనిమిదేళ్ళు దాటిన పిల్లలు ఉన్నారా.. ? " అని అడిగాడు శరత్

" అదీ..అదీ.." అంటూ నీళ్ళు నములుతున్నాడు ముసలాయన

" పర్వాలేదు చెప్పండి.."

" మా అమ్మాయి అక్షర ఉందండీ .." చెప్పాడు ముసలాయన.

" ఆహ్..అలాగా ..ఆమె ఎక్కడ పుట్టింది ..బర్త్ ఇయర్? "

గతుక్కుమన్నాడు ముసలాయన. తర్వాత సర్దుకుని హాస్పిటల్‌పేరు, పుట్టిన సంవత్సరం  తేదీ చెప్పాడు. శరత్ అవి నోట్‌చేసుకుంటున్నట్టు హడావుడి చేసి అక్కడి నుండి వచ్చేసాడు.

" బాబూ..ప్రస్తుతం అమ్మాయి ఊరెళ్ళింది..వచ్చాక వేసుకుంటుంది వేక్సిన్" అంటున్నాడు ముసలాయన వెనక నుండి. " అలాగే అండీ..నో ప్రోబ్లెం " అని చెప్పి వచ్చేసాడు.

ఇంటికి రాగానే ఆ వివరాలు అక్షరకు అందజేసాడు. " థాంక్స్ శరత్.." అని అతని చేతిని ముద్దు పెట్టుకుంది. ఆ మాత్రానికే మురిసిపోయాడు  శరత్.

* * *

బ్రిటిష్ వాళ్ళ కాలంలో కట్టిన ఆ పాత పెద్ద హాస్పిటల్ముందు నిలబడి ఒకసారి మొత్తం చూసింది అక్షర.

విశాలమైన హాస్పిటల్ అది. పాత కాలం నాటి రాతి కట్టడం. వచ్చీ పోయే సామాంయమైన రోగులతో , హడావుడిగా తిరుగుతున్న డాక్టర్లతో , నర్సులతో రద్దీ గా ఉంది. తను జన్మించింది ఈ హాస్పిటల్లోనే అని ఊహించుకుంటుంటే ఆమె ఒళ్ళు పులకించింది. కానీ తన తల్లిదండ్రులు ఎవరో తెలీదు అసలు అప్పుడు ఏం జరిగిందో తెలీదు. ఎలాగైనా తన తల్లిదండ్రుల డీటెయిల్స్ రాబట్టాలని లోపలికి ప్రవేశించింది. తిన్నగా రికార్డ్ రూములోకి వెళ్ళింది. అక్కడ ఒక వయసు మళ్ళిన వ్యక్తి పెద్ద పెద్ద కళ్ళద్దాలతో కూర్చుని ఉన్నాడు. అతనే ఆ సెక్షన్ కి ఇన్చార్జ్.

అతని టేబుల్ దగ్గరకి వెళ్ళి " సార్..సార్.." అని పిలిచింది.

ఆయన నెమ్మదిగా తలెత్తి " ..ఎవరమ్మా నువ్వు ..తిన్నగా వచ్చేసావు..అలా రాకూడదు .." అంటూ ఏదో చెబుతున్నాడు. అక్షర కొంచెం ముందుకు వంగి చిలిపిగా నవ్వింది.

అతను కొంచెం తడబడి " అంటే ..అదీ..అదీ.. కూర్చోమ్మా " అన్నాడు

" సార్.. నాకు కొన్ని డీటెయిల్స్ కావాలి .." గోముగా అంది.

" ఏం డీటెయిల్స్.."

ఒక పేపర్ముందుకు తోసి .." ఈ సంవత్సరం లో ఈ తేదీన డెలివరీ అయిన స్త్రీల పేర్లు .." అని అడిగింది

" కొంచెం కష్టమమ్మా..అయినా ప్రయత్నిస్తాను " అని లోపల షెల్ఫ్ ల దగ్గరికి వెళ్ళాడు. చాలా సేపు వెతికి వచ్చి " అవన్నీ కంప్యూటర్లో ఎక్కించాం ఈ మధ్యనే

..చూస్తాను ఉండు " అని ముందున్న డెస్క్ టాప్‌లో తలదూర్చాడు. సెర్చ్ చేసాక కొన్ని పేర్లు చెప్పాడు. లక్కీగా ఆ రోజు అందరికీ మగపిల్లలు పుట్టారు. ఒక్క ఆమెకు తప్ప .

" ఆవిడ పేరు చెప్పండి " అని అడిగింది అక్షర

పది సార్లు చెక్‌చేసి చెప్పాడు అతను. " పరిమళ " అని. ఒక వింత భావం కదలాడింది అక్షరకు తన తల్లి పేరు తెలుసుకోగానే

" చాలా చాలా థేంక్సండీ .." అని అతనికి షేక్‌హేండ్‌ఇచ్చింది . " అవసరమైతే మళ్ళీ రామ్మా.." అని చెప్పాడు ఆ ఇన్‌చార్జ్. నవ్వేస్తూ వచ్చేసింది అక్షర.

" తన తల్లి పేరు పరిమళ. " అని పది సార్లు మనసులో తలచుకుని పొంగిపోయింది అక్షర

* * *

హాస్పిటల్‌లో దొరికిన తల్లి ఎడ్రస్‌ని మళ్ళీ ఒక సారి చూసుకుంది అక్షర. ఆటో లో ఆ ప్రాంతానికి వెళ్ళి ఎంక్వైరీ మొదలు పెట్టింది.

అడ్రస్‌లో ఉన్న ఇంటిలో ఇప్పుడు ఎవరో ఉంటున్నారు. అది పరిమళ , హరీష్ కాపురం ఉన్న ఇల్లు. హరీష్ మరణం తర్వాత, కూతురు పుట్టినాక ఆ ఇల్లు ఖాళీ చేసి వచ్చేసింది పరిమళ . అందుకే ప్రస్తుతం ఉన్న వాళ్ళకి ఆమె గురించి తెలీదు. అయినా పట్టు వదలకూడదు అనుకుంది అక్షర.

ఆ ఇంట్లో ఉన్న వాళ్ళు " నీ ఫోన్ నెంబర్ ఇవ్వమ్మా.. ఏదైన ఆచూకీ తెలిస్తే ఫోన్‌చేస్తాము "అన్నారు. వాళ్ళకి తన సెల్‌నెంబర్‌ఇచ్చి అక్కడి నుండి వచ్చేసింది.

సురేష్ గురించి ఆలోచనలు కూడా మనశ్శాంతి లేకుండా చేస్తున్నాయి అక్షరకు. అతడు దొరకడం లేదు. ఎక్కడ దాక్కున్నాడో తెలియడం లేదు.

రూముకొచ్చాక శరత్‌తో తన బాధ ని చెప్పింది. అతనికి కూడా పరిమళ ను ఎలా కనుక్కోవాలో అర్థం కాలేదు. ఆ పేరుతో ఉన్న ఆడవాళ్ళ లిస్ట్ దొరికితే తెలుస్తుంది కానీ అలాంటివన్నీ సినిమాల్లోనే సాధ్యం. నిజ జీవితంలో అంత నెట్‌వర్క్ ఉన్న స్నేహితులు ఉండరు కదా. అయినా ఆ ఏంగిల్‌లో ప్రయత్నిస్తే బాగుంటుందని అనిపించింది ఇద్దరికీ.

శరత్‌తన తల్లిదండ్రులకు ఉన్న ఇన్‌ఫ్లుయెంస్ తో ఒక పోలీస్‌ఆఫీసర్‌ని కాంటాక్ట్ చేసాడు. అతనికి తన సమస్య ని చెప్పాడు. జెన్యూన్ గా అనిపించడంతో సహాయం చేస్తానని చెప్పాడు ఆ పోలీస్‌ఆఫీసర్. అతని ద్వారా పరిమళ అన్న పేరుతో ఉన్న వాళ్ళ లిస్ట్ వీళ్ళకి దొరికింది.

పక్కనే ఫోన్‌నెంబర్లు ఉన్నాయి. ఓపిగ్గా వాటన్నిటికీ ప్రయత్నించాలని అనుకుంది అక్షర. ఒక్కొక్కరికీ కాల్‌చేసి " బాగున్నావమ్మ ..నేను నీ కూతురుని " అని అనసాగింది. చాలా మంది తిట్టిపోసి ఫోన్ కట్ చేస్తున్నారు. ఇంకొంతమంది ' మాకింకా పెళ్ళి కాలేదమ్మా ..' అని నవ్వేస్తున్నారు. కానీ ఒక్క స్త్రీ మాత్రం కాసేపు షాక్ అయి నిశ్శబ్దంగా ఫోన్‌పెట్టేసింది. ఆమే తన తల్లి అని అనిపించింది అక్షరకు. ఆ ఎడ్రస్‌ని ప్రేమగా తడిమింది ఒకసారి. శరత్‌కి ' థాంక్స్' చెప్పింది. ఒక సమస్య తీరినందుకు హాయిగా ఫీల్‌అయింది. తన కన్న తల్లి ని కలవబోతున్నందుకు ఉద్విగ్నంగా ఫీల్‌అవుతోంది. ఆమె భావోద్వేగానికి అడ్డుపడదలచుకోలేదు శరత్.

* * *

' నేను మీ అమ్మాయిని మాట్లాడుతున్నా ' అని ఫోన్‌కాల్‌వచ్చిన తర్వాత బాగా

డిస్టర్బ్ అయింది పరిమళ.
ఆఫీసులో ఉన్నప్పటికీ , చుట్టూ కొలీగ్స్ తిరుగుతూ ఉన్నా కూడా ఆమె మనసు గతకాలపు ఆలోచనల్లోకి పరుగెత్తింది.

భర్త హరీష్ , తల్లి సావిత్రి ఇద్దరూ తనను విడిచి వెళ్ళిపోయాక బాగా ఒంటరిదయిపోయింది పరిమళ. నా అన్న వాళ్ళు ఎవ్వరూ లేరు. అప్పటికే నెలలు నిండి ప్రసవానికి సిద్ధంగా ఉంది. తనకంటే వయసులో బాగా చిన్నదైన కొలీగ్' సుధ ' మాత్రం అప్పుడప్పుడు వచ్చి ఆమె బాగోగులు చూసుకునేది.
ఒక రోజు సాయంత్రం బాగా వర్షం మొదలైంది. నిండు గర్భిని పరిమళ పురిటి నొప్పులు పడసాగింది. వెంటనే సుధ కు ఫోన్‌చేసి ' ఒక సారి రా..' అని అడిగింది. సుధ వెంటనే వచ్చింది.
అప్పటికే బాగా ఇబ్బంది పడుతోంది పరిమళ . ఆటో ని పిలిచి పెద్ద హాస్పిటల్‌కి తీసుకు వచ్చింది సుధ. వెంటనే మెటర్నరీ వార్డ్ లోకి షిఫ్ట్‌చేసారు పరిమళని. వర్షం మాత్రం ఆగకుండా కురుస్తూనే ఉంది. ఆ రాత్రి బాగా పొద్దుపోయాక ఒక ఆడపిల్లకు జన్మ నిచ్చింది పరిమళ.
హాస్పిటల్ బెడ్ మీద నీరసంగా పడుకుంది పరిమళ. చక్కటి ఆడ పిల్లకి జన్మ నిచ్చాక సంతృప్తిగా ఫీల్ అయింది. కానీ వెంటనే మనసంతా బాధగా అయింది. ఈ సంతోషాన్ని పంచుకోవడానికి తన భర్త హరీష్ ఈ లోకంలో లేడు.కేన్సర్ తో చనిపోయాడు. చివరికి తల్లిదండ్రులు కూడా లేరు . అది తలచుకోగానే బాధ మరింత ఎక్కువ అయింది.
ఆమె తలపైన ఒక అమృత హస్తం చల్లగా కదిలింది. తలెత్తి చూసింది పరిమళ.

ఎదురుగా సుధ . " కంగ్రాచ్యులేషన్స్..చక్కటి ఆడపిల్లకు జన్మ నిచ్చావు " అంది. సుధ చేతిని గట్టిగా పట్టుకుని భోరున విలపించసాగింది పరిమళ.

" అరె ...ఎందుకేడుస్తున్నావు...ఇప్పుడేమైంది .." ప్రేమగా అంది సుధ

" ఇప్పుడు నాకు ఎవరున్నారని సంతోషపడటానికి ...ఈ ఆడ పిల్లను నేను ఎలా సాకగలను .." అంది పరిమళ

" అలా అంటావేంటి.. తల్లివి నువ్వుండగా ఆ పిల్లకు ఏం భయం .."

" నీకు అర్థం కావడం లేదు సుధా.. అందరూ దూరమై మానసికంగా నేను చచ్చిపోయాను..ఈ బాధ్యతను మోసేంత ఓపిక నాకు లేదు.. నువ్వే ఒక మార్గం చూడు " అని ప్రాధేయపడింది పరిమళ.

మౌనంగా అయిపోయింది సుధ. ఇలాంటి విషయాల్ని డీల్‌చేసేంత వయసు, మానసిక పరిపక్వత లేవు ఆమెకి. అందుకే తన తల్లిదండ్రులని కాంటాక్ట్ చేసింది. వాళ్ళు ఒక సలహా ఇచ్చారు. ఆ సలహా ప్రకారం - పరిమళ డిశ్చార్జ్ అయ్యాక పుట్టిన ఆడ పిల్లను , పిల్లలు లేని వేరే దంపతులకి పెంచుకోవడానికి ఇచ్చేసారు. వయసు మీరిన ఆ దంపతులు కూడా ఆనందంగా ఆ ఆడపిల్లను స్వీకరించారు. ఆ విధంగా పుట్టగానే తల్లికి దూరమైంది ఆ ఆడపిల్ల.

ఆ తర్వాత...ఒంటరిగా జీవిస్తున్న పరిమళను చూసి అందరూ పెళ్ళికాని అమ్మాయి జాబ్ చేసుకుంటూ ఉంటోందని అనుకునే వారు. సురేష్ కూడా ఆ విధంగానే పొరబడి ప్రేమించానని ప్రపోజ్ చేసాడు.మంచి వాడేమో అని నమ్మి పెళ్ళి చేసుకున్నందుకు తర్వాత నరకం చూపించాడు. జరిగినదంతా గుర్తొచ్చేటప్పటికి మనసంతా అదోలా అయిపోయింది పరిమళకు.

అయితే అలా అప్పుడు వాళ్ళకి అప్పగించబడిన ఆడపిల్ల ఇప్పుడు తన గురించి

వాకబు చేస్తోందా అన్న ఊహ పరిమళ మనసులో వేయి వీణలు మ్రోగేలా చేస్తోంది. తియ్యటి అనుభూతి కలిగింది ఆమెకు.

* * *

గెస్ట్ హౌస్‌లో ...పరిమళ బాస్ సురేంద్ర ....రమ్యతో ఆనందంగా గడుపుతున్నాడు.
రమ్యఅంది " ..ఏంటి ఇవాళ మంచి ఊపు మీద ఉన్నారు.." అని
మనోహరంగా నవ్వాడు సురేంద్ర. " దేవిగారు ...చాలా కాలానికి కరుణించారు కదా..అందుకని " అన్నాడు గ్లాసులోని పెగ్‌లాగిస్తూ.
" అవునా..." అంటూ గువ్వలా ఒదిగిపోయింది అతని కౌగిలిలో . నెమ్మదిగా ఆమెను వివస్త్రను చేసాడు. ఎన్ని సార్లు చూసినా ఆమె అందాలు కొత్తగానే అనిపిస్తాయి అతనికి. మెత్తటి ఆమె శరీర స్పర్శ ఎగిసే అల లాంటి ఉత్తేజాన్ని కలిగిస్తుంది అతనికి. పూర్తిగా ఆమెను ఆక్రమించుకుని అనుభవించసాగాడు. తియ్యటి మూల్గులు , నిట్టూర్పులతో గది మారు మోగిపోయింది. ఆమెలోని మకరందాన్ని పూర్తిగా గ్రోలాక, లేచి లుంగీ కట్టుకుని సిగరెట్ వెలిగిస్తూ బయట సిటౌట్ లోకి వచ్చాడు సురేంద్ర.
" అయిందా ఎంజాయ్‌మెంట్.." అని పక్కనుండి వినబడటంతో చివ్వున తలతిప్పి చూసాడు. ఎదురుగా నవ్వుతూ సురేష. అక్కడే తీరిగ్గా కూర్చున్నాడు.
" నువ్వా..ఎప్పుడొచ్చావ్..." చిరాగ్గా అన్నాడు సురేంద్ర
" వచ్చి చాలా సేపయింది.. అయినా తమరు చాలా బిజీగా ఉన్నారు కదా.. నేనొచ్చింది ఎలా తెలుస్తుంది.." కేర్లెస్‌గా అన్నాడు
" షటప్.. బలిసిందా..ఎక్కువ మాట్లాడుతున్నావు.. " కోపంగా అన్నాడు సురేంద్ర

" ఎవరికి బలిసిందో కనిపిస్తుంది కదా.. నాకు డబ్బులు కావాలి ..ఇవ్వు "

" డబ్బులా...ఎన్ని సార్లు ఇవ్వాలి.. ఇప్పటికే చాలా ఇచ్చాను..ఇక కష్టం.. వెళ్ళు ...తర్వాత కలుద్దాం.."

" ఏం...నేను ఇక్కడ ఉంటే నీకు డిస్టర్బెన్సా ...." అంటూ లోపలికి తొంగి చూసాడు సురేష.

" రాస్కెల్...ఏంట్రా మాట్లాడుతున్నావ్.. పో బయటికి " అని అరిచాడు సురేంద్ర. ఈ గొడవకి లోపలి నుండి బయటకు వచ్చింది రమ్య. సురేష్ ని చూసి కొంచెం తడబడింది.

సురేంద్ర " రమ్య..నువ్వు లోపలికి వెళ్ళు " అని కసురుకున్నాడు. ఆమె లోనికి వెళ్ళిపోయింది.

సురేష్ ని చూస్తూ " ఇంకా ఇక్కడే ఉన్నావేం ...వెళ్ళమని చెప్పాను కదా.." అని అరిచాడు సురేంద్ర." సరే..ఇప్పుడు వెళ్తాను ...మళ్ళీ ఎప్పుడు రమ్మంటావు " కూల్‌గా అడిగాడు సురేష్

" అది నేను తర్వాత చెబుతాను .."

సురేష్ నెమ్మదిగా అన్నాడు. " నా చేత ఎన్నో నేరాలు చెయ్యించావు..చివరికి పరిమళ ను పెళ్ళి చేసుకునేలా చేసావు. ఆమెను నీ పక్కలోకి పంపించమన్నావు. నీ కోసం ఎంతో మంది అమ్మాయిలని కిడ్నాప్‌చేసాను. నీ చేతిలో పడ్డాక వాళ్ళు ఏమయ్యారో తెలీదు. ఇవన్నీ గుర్తు పెట్టుకో ...నన్ను కంట్రోల్ చెయ్యాలని చూడకు. జాగ్రత్త " అని చెప్పి వెళ్ళిపోయాడు.

సురేంద్ర గాఢంగా నిశ్వసించాడు. " వీడు బాగా ముదిరిపోయాడు. లాభం లేదు ...ఏదో ఒకటి చేసి వీడ్ని వదిలించుకోవాలి " అని గట్టిగా నిర్ణయించుకున్నాడు.

* * *

పొద్దున్నే పరిమళ ఇంటి దగ్గర కాపు కాసింది అక్షర.

కాసేపటికి పరిమళ బయటకు వచ్చి ఆఫీసు కి వెళ్ళిపోయింది. ఆ ఇంట్లో ఇంకా ఎవరెవరు ఉన్నారో తెలుసుకోవాలని అనుకుంది అక్షర. అందుకే వెయిట్ చెయ్యసాగింది. కానీ ఎవరూ ఉన్న ఆచూకీ ఆమెకు కనబడలేదు. కనీసం పని ఆమె కూడా ఆ ఇంటికి వస్తున్నట్టు అనిపించలేదు. ' సరే ..తల్లి ని తీరిగ్గా కలుద్దాం ' అనుకుని వెళ్ళబోతుండగా , అప్పుడే బయటకు వచ్చిన సురేష్ కనిపించాడు. అదిరిపడింది అక్షర. ' మైగాడ్...వీడు తన తల్లితో ఉన్నాడేంటి ? ' అని విపరీతమైన ఆశ్చర్యానికి లోనయింది. ఇదేదో తల్లినే అడిగి తెలుసుకోవాల్సిన విషయం అని అనిపించింది. నిశ్శబ్దంగా అక్కడి నుండి వచ్చేసింది. తల్లి కి సంబంధించిన విషయాలతో పాటూ , సురేష్ ఆచూకీ కూడా దొరకడంతో హేపీగా ఫీల్ అయింది అక్షర. తిన్నగా శరత్ దగ్గరకి వచ్చింది.

" శరత్..నేను అనుకున్న లక్ష్యానికి చాలా దగ్గరగా వచ్చాను. ఇప్పుడు బయటకు వెళ్తున్నాను..మళ్ళీ వస్తానో రానో తెలీదు " అంది

" అవునా..కంగ్రాట్స్.. నువ్వు తప్పకుండా విజయం సాధిస్తావు.. ఆ నమ్మకం నాకుంది. ఆ దేవుడు దయతలిస్తే మళ్ళీ మనం కలుస్తాం" అన్నాడు శరత్

" కానీ..నువ్వు నాకో మాటివ్వాలి.. "

" ఏంటది ..."

" అన్ని చెడు అలవాట్లు మానెయ్యాలి.. నీ తల్లిదండ్రులతో ప్రేమగా ఉండాలి.. "

" అబ్బా..ఏం ఫిటింగ్ పెట్టావు..."

" నా మీద నీ ప్రేమ నిజమైతే నువ్వు నే చెప్పినవన్నీ చెయ్యాలి ...ఓకేనా.."

" అలాగే తప్పకుండా.." అన్నాడు శరత్.
" బై..బై.." అని చెప్పి అక్కడినుండి వచ్చేసింది అక్షర. తల్లి ని కలవడానికి ఆమె ఆఫీసుకి వెళ్ళింది.

" మేడం ...మీ కోసం ఎవరో అమ్మాయి వచ్చింది " అని ప్యూన్‌చెప్పడంతో బయటకు వచ్చింది పరిమళ.
అక్కడ నిలబడి ఉన్న అమ్మాయి ని చూడగానే  అప్రయత్నంగా గుండెలో ఏదో సవ్వడి మొదలైంది. పేగు బంధం కదిలింది. కళ్ళల్లోకి నీళ్ళు వచ్చి చేరాయి. వాటిని కంట్రోల్ చేసుకుంటూ
" ఎవరమ్మా నువ్వు...ఎందుకొచ్చావు .." అని అడిగింది
" అదేంటమ్మా...  గుర్తుపట్టలేదా..అలా ఎలా వదిలేసావు నన్ను " ఏడుస్తూ అంది అక్షర.
ప్రేమగా ఆమెను దగ్గరకు తీసుకుంది పరిమళ. " నిన్నెలా మర్చిపోతాను తల్లీ.. నా జీవన జ్యోతి వి. నేనే రాక్షసి ని . నిన్ను దూరం చేసుకున్నాను " అని బాధపడసాగింది గుండెలో భారం దిగేదాకా అలా ఆలింగనం చేసుకుని ఉన్నారు. తర్వాత ఇద్దరూ కేంటీన్ వైపు వెళ్ళి ఒక పక్కగా కూర్చున్నారు. సర్వర్ వచ్చి టీ పెట్టి వెళ్ళాడు.
అక్షర " చెప్పమ్మా..అసలు ఏం జరిగింది ..నన్ను ఎందుకు వదిలేసావు..వేరే వాళ్ళ దగ్గర ఎందుకు పెరగనిచ్చావు " అని అడిగింది.
గాఢంగా నిశ్వసించి మొత్తం తన గతాన్ని చెప్పింది పరిమళ. ఒక విచిత్రమైన నిశ్శబ్దం ఆవరించింది వాళ్ళిద్దరి మధ్య. చాలాసేపటి తర్వాత దాన్ని భగ్నం చేస్తూ "

అది సరే.. ఆ సురేష్ ఎలాంటి వాడో తెలీకుండా పెళ్ళి ఎందుకు చేసుకున్నావమ్మా.." అని అడిగింది అక్షర.

" తోడు కోసం అమ్మా.. మీ అందరినీ దూరం చేసుకున్నాను..ఒంటరి ఆడదాన్ని.. అందుకే అతన్ని పెళ్ళి చేసుకున్నాను "

" పోనీలేమ్మా. త్వరలోనే వాడి పీడ విరగడవుతుంది నీకు.."

" అంటే..ఏంటి ..అతను నన్ను వదిలేసి వెళ్ళిపోతాడా.. " ఆశ్చర్యంగా అడిగింది పరిమళ .

తడబడింది అక్షర. " అబ్బే ..అది కాదమ్మా..అతనే మంచిగా మారతాడని.." సర్ది చెప్పింది అక్షర.

" సరే అమ్మా..ప్రస్తుతం ఒక ఫ్రెండ్ దగ్గర ఉంటున్నాను..మళ్ళీ కలుద్దాం " అని లేచింది .

" అలాగే అమ్మా.. జాగ్రత్త.." అని కూతురి భుజం తట్టి ఆఫీసులోకి వెళ్ళిపోయింది పరిమళ.

* * *

సెల్ రింగ్ అవుతుంటే చూసి ఎత్తింది పరిమళ. " నాకు బాగా మూడ్ వస్తోంది ...ఇంటికి వచ్చెయ్ " అని అడిగాడు సురేష

" ఛీ..ఛీ.. నీకేమైనా బుద్ధుందా ? ఇప్పుడెలా వస్తాను? ఆఫీసు పనితో బిజీగా ఉన్నాను. " సున్నితంగా చెప్పింది పరిమళ

" ఏంటే నీతులు చెబుతున్నావు...నీకు ఎలాగూ మొగుడి అవసరం లేదు , ఇప్పుడు నేనెవరి దగ్గరికి వెళ్ళాలి ? " అంటూ గట్టిగా అరిచాడు. ఏం చెప్పాలో తెలీక ఫోన్ పెట్టేసింది పరిమళ.

* * *

ఆ మధ్యాహ్నం పోలీస్ స్టేషన్ లో ఫోన్ రింగ్ అవసాగింది. కానిస్టేబుల్ రిసీవర్ ఎత్తి " హలో ...ఎవరూ ? " అన్నాడు

" నేను...సురేష్ ని ...దయ్యం..దయ్యం... నన్ను చంపాలని చూస్తోంది.... " అంటూ ఏదో చెబుతుండగా లైన్ కట్ అయింది. అనుమానం వచ్చి కానిస్టేబుల్ సురేష్ ఇంటికి వెళ్ళాడు. అప్పటికే జరగరాని ఘోరం జరిగిపోయింది. ప్రాణాలు పోయిన సురేష్ శవమై పడి ఉన్నాడు. వెంటనే ఈ విషయాన్ని స్టేషన్ కి ఇంఫార్మ్ చేసాడు కానిస్టేబుల్ . క్లూస్టీం వచ్చి అన్ని క్లూస్ కలెక్ట్ చేసుకుని వెళ్ళింది .అంబులెన్స్ వచ్చాక శవాన్ని పోస్ట్ మార్టం కోసం తరలించారు.

తెలిసిన వాళ్ళెవరో ఫోన్ చేయడంతో హతాశురాలై ఇంటికి వచ్చింది పరిమళ. అప్పటికే ఎస్సై అక్కడికి వచ్చి ఉన్నాడు.

" నీ మాజీ భర్త ఆత్మ తనని హెరాస్ చేస్తుందని కంప్లెయింట్ ఇచ్చాడు మీ ఆయన, ఈ రోజు శవమై తేలాడు. చాలా అనుమానాలు ఉన్నాయి ఈ కేసులో. మీరు మాకు కొంచెం సహకరించాలి " అని పరిమళతో చెప్పి వెళ్ళిపోయాడు. నిశ్చేష్టురాలైంది. అసలు ఏం జరిగి ఉంటుందో అర్థం కాలేదు. నిజంగానే సురేష్ ని హరీష్ ఆత్మ చంపేసి ఉంటుందా ? అంత అవసరం ఏమొచ్చింది ? ఎన్నో సందేహాలు ఆమె మదిలో కదిలాయి.

* * *

పోస్ట్ మార్టం రిపోర్ట్ లో ' సురేష్ విపరీతమైన భయానికి గుర్తై గుండెపోటు తో

చనిపోయాడని  ' తేలింది. అతడు అందరికీ చెబుతున్నట్లుగానే , ఇన్నాళ్ళూ అతడిని వేధించిన హరీష్ ఆత్మ అతడిని చంపేసింది. ఇలాంటి కేసుని పరిశోధించడం టైం వేస్ట్ అని పోలీసులు కేస్ క్లోజ్ చేసేసారు. కాలం గడిచిపోతోంది. కానీ పరిమళ మనసులో ఎన్నో సందేహాలు. సురేష్  అంత భయ విహ్వాలుడు కావడానికి దారి తీసిన పరిస్థితులు ఏంటో ఎంత ఆలోచించినా అర్థం కాలేదు.

తర్వాత ఒక రోజు ..ఆఫీసుకి వెళ్ళాక తెలిసిన  వార్తను చూసి మరింత షాక్అయింది పరిమళ . ' బాస్ సురేంద్ర ఘోర రోడ్డు ప్రమాదం లో చనిపోయాడని ' తెలిసింది.  ఆఫీసు అంతా విషాదం అలముకుంది. ఎందుకిలా జరిగింది అని అందరూ చర్చించుకోసాగారు. ' బాగా తాగి ఉన్నాడని ' ఒకరు.. ' లేదు ...లేదు.. స్టీరింగ్కంట్రోల్తప్పి పక్కనే ఉన్న లోయ లోకి పడిపోయాడని ' ఒకరు ఇలా రక రకాలుగా చెప్పుకుంటున్నారు. కాసేపటికి పోలీసులు వచ్చారు. అందరూ సైలెంట్గా అయిపోయారు వాళ్ళని చూసి.

"  అందరినీ కొంచెం ఇంటెరాగేట్ చెయ్యాలి..ప్లీజ్ కోపరేట్ విత్ అజ్.. " అన్నాడు ఎస్సై.

ఒక్కొక్కరినీ పిలిచి రొటీన్ప్రశ్నలు వేసారు. వీళ్ళు చెప్పిన సమాధానాల్ని నోట్ చేసుకున్నారు. రమ్యను మాత్రం చాలా సేపు ప్రశ్నలతో వేధించారు.

" మీ బాస్ సురేంద్ర ఎలాంటి వారు.." అడిగారు రమ్యను

" చాలా మంచి వారు .." చెప్పింది

" మంచి అంటే .."

" మంచి అంటే ..మంచి అండీ ..ఎలా చెప్పాలి.. "

" అందరినీ బాగా వేధిస్తాడని తెలిసింది.. ముఖ్యంగా మీ లాంటి అందగత్తెలని ...అందుకే అడుగుతున్నాం "

" ఏమో సార్...నాతో చాలా డిగ్నిఫైడ్‌గా ఉండేవారు .." చెప్పింది రమ్య.

" మరి అతని గెస్ట్ హౌస్‌కి ఎందుకు వెళ్ళేవారు.."

" అదీ..అదీ.." నీళ్ళు నమలసాగింది రమ్య

" సరే ...అవసరమైతే స్టేషన్‌కి పిలుస్తాం.. ఒకసారి రావాల్సి ఉంటుంది " అని చెప్పి పంపించేసారు.

తర్వాత పరిమళ ను పిలిచారు. " చెప్పండి  సురేంద్ర ఎలాంటి వారు .. " అని అడిగారు

' అంత మంచి వారు అని చెప్పలేము ...."

" అంటే ..."

" స్త్రీ లోలుడు సార్.. ఊరికే వేధిస్తుంటాడు .."

" ఓకే.. మీ భర్త సురేష్ తో ఆయనకేమిటి సంబంధం .."

షాక్‌అయింది  పరిమళ ఈ ప్రశ్న తో . సురేష్ కి తన బాస్‌తో సంబంధమా.. ?

అందుకే " ఏమో అండీ మీ ప్రశ్న నాకు అర్థం కాలేదు.. నా భర్తకు ఆయనతో పనేంటి.. పైగా ఆయన కూడా చనిపోయారు " అంది " అది మాకు తెలీదు కానీ.. మీ భర్త సురేష్ తరచుగా ఆయన్ను గెస్ట్ హౌస్‌లో కలుస్తూ ఉండేవారు.." అన్నాడు ఎస్సై. ఈ మాటలు విని మరింత కంఫ్యూజన్‌లో పడిపోయింది  పరిమళ.

" సరే ...అవసరమైతే స్టేషన్‌కి పిలుస్తాం.. వెళ్ళండి " అని చెప్పి పంపించేసారు ఆమెను. ' ఏంటో తన జీవితం.. అన్నీ అర్థం కాకుండా  ఉన్నాయి ' అనుకుని తన సీట్లో కూలబడింది.

* * *

అక్షర , పెంచిన తల్లిదండ్రుల దగ్గరకి వెళ్ళింది. అదీ ఎవరూ చూడని రాత్రి సమయంలో.

ఆమెను చూడగానే బావురుమన్నారు ఆ వృద్ధ దంపతులు.

" ఎక్కడికి వెళ్ళిపోయావమ్మా.. మమ్మల్ని వదిలి " అని వాపోయారు.

" అదంతా ఒక పీడ కల అమ్మా..ఆ భగవంతుడి దయ వల్ల క్షేమంగా బయటపడ్డాను. " అంది అక్షర

" సరే అమ్మా..ఇక మీదట మమ్మల్ని వదిలి వెళ్ళకు .." ప్రాధేయ పడ్డారు వాళ్ళు.

మౌనంగా అయిపోయింది అక్షర.

" నేనొక ప్రశ్న అడుగుతాను.. చెప్పందమ్మా.." అంది అక్షర

" ఏంటమ్మా ...అడుగు .." అంది ముసలామె

" నా తల్లిదండ్రులు ఎవరమ్మా.."

షాక్ అయ్యారు ఆ దంపతులు. " అదేం ప్రశ్న అమ్మా.. మేమే కదా నీ తల్లిదండ్రులం .." బాధగా అన్నారు

" నాకు అన్నీ తెలుసమ్మా.. నేను మీ నోటి నుండే విన్నాను.."

" మేము ఎప్పుడు చెప్పామమ్మా.."

" సరే అవన్నీ ఇప్పుడెందుకు.. నేను నా తల్లిని కలిసానమ్మా.." నెమ్మదిగా చెప్పింది అక్షర

ఇది విని కన్నీళ్ళ పర్యంతమయ్యారు ఆ దంపతులు. " ఎప్పుడో నిన్ను పుట్టగానే మాకు ఇచ్చేసారు ...నిన్ను పెంచి , విద్యాబుద్ధులు నేర్పి ఇంత దాన్ని చేసాము.

ఇప్పుడు మమ్మల్ని వదిలేస్తావా తల్లీ "

" అలాంటిదేమీ ఉండదమ్మా.. నేను మరీ అంత మనసు లేని దానిని కాదు. మిమ్మల్ని జాగ్రత్తగా చూసుకుంటాను. సరేనా.. " అని భరోసా ఇచ్చింది అక్షర తెరిపిన పడ్డారు వాళ్ళు. " మళ్ళీ వస్తానమ్మా.." అని చెప్పి అక్కడి నుండి వచ్చేసింది . తర్వాతి రోజు ఆ దంపతులు పోలీస్‌స్టేషన్‌కి వెళ్ళి తమ అమ్మాయి తిరిగి ఇంటికి వచ్చిందని చెప్పి కేస్ క్లోజ్ చెయ్యించారు. ఆ కథ ఆ విధంగా ముగిసింది వాస్తవాల్ని మరుగున దాచి.

* * *

ఆఫీసు కేంటీన్‌లో కూర్చుని మాట్లాడుకుంటున్నారు సుధ , పరిమళ .

ఈ మధ్య జరిగిన పరిణామాల వల్ల వాళ్ళిద్దరూ మనసు విప్పి మాట్లాడుకున్నది తక్కువ. అందుకే ఈ రోజు ఇలా సమావేశమయ్యారు.

" ఏంటి పరిమళా.. ఈ సంఘటలన్నీ.. అన్నీ వింత వింతగా ఉన్నాయి " అంది సుధ.

" అవును సుధా.. నాకూ అదే అర్థం కావడం లేదు. ఒక దానికొకటి లింక్ ఉంటోంది. చూసావు కదా ..మొన్న పోలీసులు మనందరినీ ఎలా ఎంక్వైరీ చేసారో.."

" అవును ..సరే గానీ అమ్మాయి కలిసింది అని చెప్పావు.. ఇప్పుడెలా వుంది .."

" బాగానే ఉంది ..ఎవరో ఫ్రెండ్‌తో కలిసి ఉంటోందట. మళ్ళీ కలుస్తానని చెప్పింది..అయినా ఆనాడు నువ్వు సాయం చేసి ఉండకపోతే మేము ఏం అయిపోయేవారమో ..." ఆప్యాయంగా అంది

" సరేలే ...గడిచిపోయిన సంగతి ఎందుకు...అసలు సురేష్ కి మన బాస్ సురేంద్రకు లింక్ ఏంటి.. వీళ్ళిద్దరికీ ముందే పరిచయమా...అసలు సురేష్ , సురేంద్ర

లవి సహజ మరణాలేనా.. ఏదో ఉంది పరిమళా..మనకు తెలియని రహస్యమేదో ఉంది ..." అనుమానంగా అంది సుధ.

పరిమళకు కూడా అది నిజమే అని అనిపించింది. కాసేపు మాట్లాడుకున్నాక సెక్షన్‌కి వచ్చి పని లో మునిగిపోయారు.

ఆ సాయంత్రం ఇంటికొచ్చాక ...సురేష్ కి సంబంధించిన వస్తువులు పరిశీలించడం మొదలుపెట్టింది పరిమళ.

అనుమానించే వస్తువులేమీ దొరకలేదు కానీ ...బాగా వెతగ్గా దొరికిన ఒక ఫోటో పరిమళను భయంకరమైన షాక్‌కి గురి చేసింది. అది -అక్షర ఫోటో !

అంటే ..సురేష్ కి అక్షర ముందే తెలుసా.. ? అసలు అక్షరతో వీడికి పనేంటి.. ? సురేంద్ర కు కూడా దీనితో సంబంధం ఉందా ..? సుధ అన్నట్టు వీళ్ళ చావుల వెనుక ఏదైనా రహస్యం దాగి ఉందా ..?

సమాధానం లేని అన్ని ప్రశ్నలు ఒక్కసారే చుట్టుముట్టేసరికి అలాగే కూలబడిపోయింది పరిమళ.

* * *

సురేంద్ర చనిపోయాక రమ్యపరిస్థితి బాగా దిగజారిపోయింది.

ఇంతకు ముందు ఆమె ' బాస్ కేండిడేట్' అన్న భయంతో ఆమె ఏం చేసినా ఎవ్వరూ పెద్దగా అడ్డు చెప్పలేదు. ఆమె చెప్పిందే వేదం అన్నట్టు సాగిపోయింది. కానీ ఇప్పుడు సపోర్ట్ లేకపోవడం వల్ల ఇన్నాళ్ళూ ఆమె మీద పగబట్టి ఉన్న శత్రువులు నెమ్మదిగా బయటకు వచ్చారు.

ఆమె చుట్టూ చేరి " మా దగ్గరికి ఎప్పుడు వస్తావు " అని వేధించడం మొదలు పెట్టారు. ఒక రోజు ఈ బాధ తట్టుకోలేక ఏడ్వడం మొదలు పెట్టింది.

సుధ, పరిమళ ఆమెను వేరే కాంఫరెంస్ రూం లోకి తీసుకొని వెళ్ళి ఓదార్చసాగారు.
సుధ అంది " ఊరుకో రమ్యా.. చిన్న పిల్లలా ఏడుస్తున్నావ్.." అని
" వాళ్ళు అలా నన్ను అంటుంటే బాగా ఏడుపొచ్చేసింది " బాధగా అంది రమ్య.
" అయినా ..ఆఫీసు అన్నాక రక రకాల వ్యక్తులు ఉంటారు..మనమే కొంచెం జాగ్రత్తగా ఉండాలి " అంది పరిమళ
" అవును ...అయినా నేను చేసినది తప్పే ...కాదనను..కానీ నా పరిస్థితి అలాంటిది ..అందుకే సురేంద్ర కు సరెండర్ అయ్యాను ..."
సుధ, పరిమళ ఒకరి మొహాలు ఒకరు చూసుకున్నారు . బాధలో రమ్యతను చేసిన తప్పుని బయటపెడుతోంది. అది తమకు అనవసరం.
అందుకే " పోనీలే ..అవన్నీ ఇప్పుడు ఎందుకు.. నీ కుటుంబం గడవాలంటే ఈ జాబ్ నీకు కావాలి. కాబట్టి ఇవన్నీ పట్టించుకోకుండా ముందుకు వెళ్ళాలి.. ఇక మీదట అలాంటి వాటిల్లోకి వెళ్ళకుండా చూసుకోవాలి ...సరేనా" అంది పరిమళ.
" అలాగే.." అని తలూపి కన్నీళ్ళు తుడుచుకుంది రమ్య. ' హమ్మయ్య ' అనుకున్నారు సుధ, పరిమళ

ఆ రాత్రి తన ఇంటిలో ...భర్త రాజేష్ దగ్గర కూర్చుని ఉంది రమ్య. బాగా పొద్దుపోవడంతో ఇంట్ళో వాళ్ళు నిద్రావస్థ లో ఉన్నారు. ఇళ్ళంతా అదో రకమైన నిశ్శబ్దం. రోజూ ఉండే నిశ్శబ్దం. బెడ్ రిడెన్ అయిన రాజేష్ కి కావాల్సిన టేబ్లెట్స్ అవీ అందించి తను కూడా నిద్రకు ఉపక్రమిస్తుంది మామూలుగా. కానీ ఈ రోజు ఆమె కు నిద్ర రావడం లేదు. మనసులో రగులుతున్న బడబాగ్ని ఆమెను

ప్రశాంతంగా ఉండనివ్వడం లేదు.

" ఏమండీ.." అని భర్తను పిలిచింది

" ఊ ..." అన్నాడు రాజేష్

" మీతో ఓ విషయం మాట్లాడాలి.."

" చెప్పు.."

" నా మీద మీ అభిప్రాయం ఏమిటి ? "

" మంచి భార్యవు.."

నిశ్శబ్దంగా ఏడ్వసాగింది రమ్య. రాజేష్ ఆమె చేతి మీద చెయ్యి వేసి గట్టిగా పట్టుకున్నాడు. అతని కళ్ళల్లోకి చూసింది రమ్య. ' నాకు తెలుసు..' అన్నట్టు అతని చూపుల్లో భరోసా.

నెమ్మదిగా అన్నాడు." జరిగింది పీడకల..మర్చిపో.. నాకు నువ్వు..నీకు నేను.. అంతే " అని. ప్రేమ ఉప్పొంగగా అతని నుదిటి మీద ముద్దు పెట్టింది రమ్య. కిటికీ పక్కన ఉన్న మల్లె తీగ ఆనందంగా ఊగింది.

* * *

గేటెడ్ కమ్యూనిటీ లో ..

అరుణ్ , కరుణ దంపతులు తమ అబ్బాయి శరత్ గురించి చర్చించుకుంటున్నారు.

" ఏంటో అండీ ...ఈ మధ్య మనవాడు రెగ్యులర్ గా కిచెన్ లోకి వచ్చి అన్నం పెట్టుకుని రూముకి వెళ్తున్నాడు. ..ఏదో తేడాగా ఉంది వ్యవహారం " అంది కరుణ

" అవునా.. నాకు తేడా ఏమీ కనబడ్డం లేదు..అయినా నీకు ఎందుకు వచ్చింది

అనుమానం " అన్నాడు అరుణ్
" ఈ మధ్య పని అమ్మాయి వాడి రూం ఊడ్వడానికి వెళితే చాలా సేపు బయట నిలబెట్టి ...తనే రూం క్లీన్ చేసుకున్నాడట ..దాన్ని రూము లోనికి రానివ్వలేదట. ఇంతకు ముందు ఎప్పుడూ అలా చెయ్యలేదు "
" సరేలే ...అప్పుడు వాడి ఫ్రెండ్స్ ఎవరైనా ఉన్నారేమో ..నీకు అన్నీ అనుమానాలే " తేలిగ్గా కొట్టిపడేశాడు అరుణ్ .
చిన్నాగా నిట్టూర్చింది కరుణ . ఇంతలో రిత్విక్ తల్లిదండ్రులు వచ్చారు వాళ్ళింటికి. సాదరంగా ఆహ్వానించారు వాళ్ళని.
వస్తూనే గొడవకు దిగారు వాళ్ళు. " ఏంటండీ ఇది.. మీ అబ్బాయి తో చేరి మా వాడు చెడిపోతున్నాడు..అన్నీ చెడు అలవాట్లే మీ వాడికి " అంటూ అరుస్తున్నారు.
దెబ్బతిన్నట్టు చూసారు అరుణ్ , కరుణ దంపతులు.
" అయినా ...మా వాడిదే తప్పు ఎలా అవుతుందండీ.. ఇద్దరూ కలిసే తిరిగారు కదా..." అంది కరుణ
" మాకు అవన్నీ తెలీవండీ.. మీ వాడే ఎప్పుడూ వాట్సాప్ లో మా వాడికి మెసేజ్ లు పెడుతుంటాడు. ఎక్కడెక్కడికో రమ్మని పిలిస్తుంటాడు .." అని సెల్ ఫోన్ లో ఆ ఛాటింగ్ చూపించారు.
ఖంగు తినడం వీళ్ళ వంతయింది. ' మన బంగారం సరిగ్గా ఉంటే వేరే వాళ్ళని అనేదేముంది ' అనుకుని " సారీ అండీ.. మా వాడ్ని కంట్రోల్ లో పెడతాము " అని సర్ది చెప్పారు వాళ్ళకి.
" సరే ..చూద్దాం.." అంటూ వెళ్ళిపోయారు వాళ్ళు.

చాలా డిప్రెసెడ్ గా ఫీల్ అయ్యారు కరుణ , అరుణ్. బోలెడంత సంపాదించారు..అయినా ఏం లాభం ? ఉన్న ఒక్కగానొక్క కొడుకు చెప్పినట్టు వినడు. తన ప్రపంచంలో తనుంటాడు. ఇంట్లో వాళ్ళతో కలవడు. అయినా ఏదో ఒకటి తేల్చేయ్యాలి అని కొడుకుని కిందికి రమ్మని గట్టిగా కేకేసింది. తల్లి పిలవడంతో కిందికి వచ్చాడు శరత్.

" ఏంటమ్మా.. చెప్పు " అన్నాడు తల్లితో

" ఏంట్రా ఇది.. ఆ రిత్విక్ వాళ్ళ పేరెంట్స్ వచ్చి నానా గొడవ చేసి వెళ్ళారు. నువ్వే వాడ్ని పాడు చేస్తున్నావని..ఎందుకురా ఇవన్నీ " అని కొడుకుని నిలదీసింది. జరుగుతున్నది చూడసాగాడు అరుణ్

" నేనేం అలా చెయ్యలేదమ్మా.. వాడే మాటి మాటికీ రమ్మంటాడు.. స్మోక్ చేద్దామంటాడు .." అని మెల్లిగా చెప్పాడు శరత్. షాక్ అయ్యారు కరుణ , అరుణ్

" సరే ...ఇక మీదట ఎప్పుడూ వాడితో ఫ్రెండ్ షిప్ చెయ్యకు " అంది కరుణ.

" అలాగే అమ్మా..అయినా నేను పూర్తిగా మారిపోయాను.. ఇక మీదట నేను మీతో మిస్ బిహేవ్ చెయ్యను అమ్మా.. " అన్నాడు

సంతోషంగా చూసింది కరుణ. కొడుకులో ఇంత మార్పు రావడం ఆమెకు విపరీతమైన ఆశ్చర్యం కలిగించింది.

అందుకే " ఏంటి నాన్నా... నేను వింటున్నది నిజమేనా " అంది

" అవునమ్మా.. దీనికంతటికీ కారణం ఒక అమ్మాయి...నా స్నేహితురాలు.. " అన్నాడు సిగ్గుగా

అరుణ్ , పెద్ద మాటలు మాట్లాడుతున్న కొడుకుని వింతగా చూస్తున్నాడు.

" ఎవర్రా.. ఆ స్నేహితురాలు .." అంది కరుణ . సెల్ ఫోన్ తీసి అక్షర ఫోటో

చూపించాడు. ఆ ఫోటో చూసి  సంతృప్తిగా ఫీల్ అయింది కరుణ. పోనీలే ఈ విధంగా అయినా కొడుకు లో మార్పు వచ్చినందుకు సంతోషపడింది.

" సరే నాన్నా ...ముందు స్టడీస్ కంప్లీట్ చెయ్యి ...ఆ తర్వాత నీ ఇష్టం.. అప్పటిదాకా ఎటువంటి పిచ్చి పనులు చెయ్యకూడదు ...ఓకేనా " అంది.

" డన్ అమ్మా.. డన్.." అంటూ బొటనవేలు పైకెత్తి చూపించాడు శరత్.

" అబ్బో..తల్లీ కొడుకులు ఒకటి అయిపోయారే " అంటూ గట్టిగా నవ్వేసాడు అరుణ్. చాలా కాలం తర్వాత ఆనందం వెల్లి విరిసింది ఆ ఇంట్లో. అదీ అక్షర ద్వారా.. సంతోషం .. సర్వే జనా సుఖినోభవంతు.

* * *

పరిమళ  , ఒంటరిగా ఇంటిలో కూర్చుని , తన జీవితంలో జరిగిన విచిత్రమైన సంఘటనల గురించి ఆలోచిస్తూ ఉండగా కాలింగ్ బెల్ మోగ సాగింది. వెళ్ళి తలుపు తీసింది .ఎదురుగా అక్షర !

" రామ్మా ...రా లోనికి " అంటూ ప్రేమగా ఆహ్వానించింది.  వస్తూనే తల్లిని కౌగలించుకొని చాలా సేపు ఉండిపోయింది  అక్షర. తర్వాత చిన్నగా ఏడ్వసాగింది

" అయ్యయ్యో ఎందుకమ్మా అంత బాధ పడతావు ? "

" కాదమ్మా ...కాదు ...నీ జీవితం ఎందుకిలా అయిపోయిందో అని బాధగా వుందమ్మా " అంటూ చెప్పింది అక్షర .

"పోనీలేమ్మా అది నా తల రాత. విధిని తప్పించలేము కదా " ఓదార్పుగా చెప్పింది.

కాసేపటికి నార్మల్ అయింది అక్షర. వేడి వేడి కాఫీ కప్పులో పోసి తెచ్చింది

పరిమళ. దాన్ని సిప్ చేస్తూ " సురేష్ నీకు ఎలా దగ్గరయ్యాడమ్మా.." అని అడిగింది .

జరిగింది అంతా చెప్పింది పరిమళ " అయినా నీకు సురేష్ ముందే తెలుసు కదా .." అని అడిగింది అక్షర ని

" అవునమ్మా.. వాడు నన్ను కిడ్నాప్ చేసి ఒక చీకటి గదిలో నిర్బంధించిన దుర్మార్గుడు అమ్మా..వాడూ , సురేంద్ర ఒక టీం. ఇలాంటి నేరాలు చెయ్యడంలో ఆరితేరిన వాళ్ళు. అదృష్టవశాత్తు నేను క్షేమంగా తప్పించుకున్నాను " అంది

".. ఇంతకీ సురేష్ ఎలా చని పోయాడమ్మా ? " అడిగింది అక్షర.

" ఏమోనమ్మా నాకూ అంతు బట్టడం లేదు. డాక్టర్లేమో హార్ట్ ఎటాక్ అని చెప్పారు. హార్ట్ ఎటాక్ రావల్సినంత దృశ్యం అతనేం చూసాడో నాకు అర్థం కావడం లేదు " చెప్పింది పరిమళ.

" నాకు తెలుసమ్మా " అంటూ బాంబ్ పేల్చింది అక్షర.

" మైగాడ్ ! నీకెలా తెలుసు ? " విపరీతంగా ఆశ్చర్యపోయింది

" సురేష్ చనిపోయిన రోజు నేను ఇక్కడికి వచ్చానమ్మా " నెమ్మదిగా చెప్పింది.

" నువ్వొచ్చావా ? అసలు ఏం జరిగింది , నాకు చెప్పు " అంటూ రెట్టించింది పరిమళ.

కళ్ళల్లో నుండి కన్నీరు కారుతుండగా ఆ రోజు జరిగినది చెప్పసాగింది అక్షర.

* * *

ఆ రోజు...అంటే సురేష్ చనిపోయిన రోజు...

తనకు బాగా మూడ్ వస్తోందని , వెంటనే ఆఫీసు నుండి వచ్చేయమని పరిమళకు ఫోన్ చేసాడు. పరిమళ రానని చెప్పడంతో విపరీతమైన కోపం వచ్చింది అతనికి. అయినా చేసేదేం లేక మందు బాటిల్ ఓపెన్ చేసాడు. మందు సిప్ చేస్తూ టీవీలో బ్లూ ఫిల్మ్ పెట్టుకొని చూస్తూ తనలోని కామదాహాన్ని చల్లార్చుకోసాగాడు. కాసేపటికి అతనికి కిక్ ఎక్కసాగింది. ఇంతలో కాలింగ్ బెల్ మోగింది. అసహనంగా టీవీ ఆఫ్ చేసి వెళ్ళి తలుపు తీసాడు. ఎదురుగా అందమైన ఒక అమ్మాయి . మొహం పూర్తిగా కవర్డ్ ఉంది . అతడి కళ్ళు మెరిసాయి. ఆ దేవుడే దయతలచి ఈ అమ్మాయిని పంపించినట్లున్నాడు అనుకుంటూ

" రామ్మా..లోపలికి రా ..." అంటూ తప్పుకొని దారిచ్చాడు.

" మమ్మీ లేదాండీ " అంటూ లోనికొచ్చి కూర్చుంది అక్షర.

" మమ్మీ నా ? ఆవిడెవరు ? " ఆశ్చర్యపోయాడు సురేష్ .

" మీరు ఈ మధ్యనే పెళ్ళి చేసుకున్న పరిమళ నా తల్లి . నేను ఆమె మొదటి భర్తకు పుట్టిన అమ్మాయి ని . చాలా... ఇంకా క్లారిటీ కావాలా ? " నవ్వుతూ చెప్పింది.

" ఓహో ! పరిమళ పెంపకానికి ఇచ్చిన అమ్మాయి వి నువ్వే అన్న మాట. నువ్వెప్పుడూ ఈ ఇంటికి రాలేదు కదా.. అందుకే నాకు తెలీదు "

" సర్లెండి... తెలియక పోవడం వలన వచ్చిన నష్టమేమీ లేదు.ఇంతకీ మమ్మీ ఉందా లేదా ? "

" ఆ బెడ్రూం లో ఉంది...వెళ్ళు " అని చెప్పాడు. అక్షర ఆ బెడ్రూం లోకి వెళ్ళింది. సురేష్ కూడా ఆమె వెనకే బెడ్రూం లోకి వెళ్ళి బోల్ట్ పెట్టేసాడు. కామంతో కళ్ళు మూసుకు పోయి విచక్షణ కోల్పోయిన స్థితిలో ఉన్నాడు. అందుకే దొరికిన

అవకాశాన్ని వదులుకో దల్చుకోలేదు. లేడి పిల్ల మీద దాడి చేసే పులిలా అక్షర మీద కలబడ్డాడు. అక్షర కూడా ఈ అవకాశం కోసమే చూస్తోంది. సురేష్ ఒంటరిగా దొరికాడు. ఇక వీడ్ని వదలకూడదు అనుకుంది . ముందు కొంచెం భయపడుతున్నట్టు నటించాలి అనుకుని -

" ఏయ్ ...ఏంటిది ...వదులు...వావి వరసలు లేవా నీకు ? " అంటూ గింజుకోసాగింది.

" నువ్వేమైనా నా సొంత కూతురువా ? వావి వరసలు చూడ్డానికి " అంటూ గట్టిగా కౌగిలించుకున్నాడు. పెనుగులాడ సాగింది అక్షర. ఇంకా పట్టు బిగించాడు సురేష్ . ఒక్క సారిగా మొత్తం బలాన్నంతా ఉపయోగించి సురేష్ ని గట్టిగా తన్నింది. కీచుగా అరిచి దూరంగా వెళ్ళి పడ్డాడు. ఊహించని ఈ పరిణామానికి కొంచెం తడబడ్డాడు. మొహానికి ఉన్న ముసుగు తీసేసింది అక్షర.

" రాక్షసీ..నువ్వా ... అప్పుడు తప్పించుకొని పోయి ఇక్కడ తగలడ్డావా ...నీ అంతు చూస్తా " అంటూ అక్షర మీదికి వచ్చాడు సురేష్ .

" రారా..నేనూ నీ అంతు చూడ్డానికే వచ్చాను ..నన్నే కాక నా తల్లిని కూడా హింసిస్తావా ..సైకో వెధవ " అంటూ పోరాటానికి రడీ అయింది అక్షర.

అప్పుడొక అద్భుతమైన సంఘటన జరిగింది. ఎవరో బలంగా విసిరేసినట్టు దూరంగా ఎగిరి పడ్డాడు సురేష.

గాల్లోకి చూస్తూ " దయ్యం...దయ్యం " అంటూ భయపడుతూ వణికిపోతున్నాడు వీడికేదో హిస్టీరియా వచ్చి ఉంటుంది అనుకొని నిశ్శబ్దంగా గమనించసాగింది అక్షర. ఇంతలో ఎవరో ఇంట్లోకి వచ్చిన శబ్దం అయింది. చప్పున డోర్ కర్టెన్ వెనక దాక్కుంది. ఆ వచ్చిన వ్యక్తి సురేంద్ర.

రాగానే " ఏరా.. నాకే ఎదురు చెబుతావా ...నన్ను బ్లాక్ మెయిల్ చెయ్యాలని చూస్తావా.. " అంటూ సురేష్ మీదికి దూకాడు. సురేష్ అప్పటికే ' దయ్యం..దయ్యం..' అని అరుస్తూ సురేంద్ర ని పట్టించుకోవడం లేదు. అదే అదనుగా సురేంద్ర గ్లౌవ్స్ తొడుక్కున్న చేతులతో సురేష్ గొంతు పిసికి చంపేసాడు. ' కాగల కార్యం గంధర్వులే చేసారు ' అన్నట్టు చాలా హేపీ గా ఫీల్ అయింది అక్షర. కానీ చిత్రంగా సురేంద్ర కూడా ' అమ్మో దయ్యం.. దయ్యం.. ' అంటూ అలాగే పారిపోయాడు . తర్వాత తన కారు డ్రైవింగ్ చేస్తూ మతి తప్పి సెల్ఫ్ ఏక్సిడెంట్ కి గురయ్యాడు. ' ఇక తను చెయ్యాల్సింది ఏమీ లేదని ' అక్కడి నుండి నిశ్శబ్దంగా తప్పుకుంది అక్షర.

* * *

" అదమ్మా జరిగింది ... అయితే సురేష్ , సురేంద్ర ఎందుకు 'దెయ్యం ... దెయ్యం' అంటూ అరిచారో నాకు తెలీదు. పోనీలే.. ఆ రాక్షసుడి పీడ మనకు వదిలింది " అంటూ నిట్టూర్చింది అక్షర.

జరిగింది అర్థమైంది పరిమళకు. హరీష్ ఆత్మ తనను ఎలాగైతే రక్షిస్తుండేదో , కూతురి ప్రాణాన్ని , మానాన్ని కూడా అలాగే కాపాడుకుంది. ఇక తమకు ఏ భయమూ లేదు..ముందున్నదంతా మంచి కాలమే అనుకుంటూ అక్షరను దగ్గరికి తీసుకుంది పరిమళ . శుభం అన్నట్లు దూరంగా ఎక్కడో గుడి గంటలు మ్రోగుతున్నాయి.

----------00000--------